తాడిజెర్రి వద్ద వరదకాల్వను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

వరద కాల్వకు నీటిని విడుదల చేయాలి

గంగాధర, మార్చి 24 : వరదకాల్వకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తాడిజెర్రి వద్ద అడుగంటిన వరదకాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో వరద కాలువ 365 రోజులూ జీవనదిలా పారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చుక్కనీరు లేక ఎడారిగా మారిందన్నారు. ఉద్యమ సమయంలో నాటి ప్రభుత్వం కూడా పంటలకు నీరు ఇవ్వకుంటే ధర్నాలు, రాస్తారోకోలు చేసి నీళ్లు ఇప్పించామని గుర్తు చేశారు. రెండు రోజుల్లో వరద కాల్వకు నీళ్లు ఇవ్వకుంటే రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

వరదకాల్వపై ధర్నాకు రైతుల యత్నం

గంగాధర, మార్చి 24 : వరదకాల్వకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని మండలంలోని కొండన్నపల్లి వద్ద జగిత్యాల, కరీంనగర్ జాతీయ రహదారిపై ఆదివారం వరదకాల్వ పరీవాహక ప్రాంతం రైతులు ధర్నాకు దిగారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వారితో ఫోన్‌లో మాట్లాడారు. రైతులు ఆందోళన చెందవద్దని, వరదకాల్వకు నీటిని విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో రైతులు ధర్నా విరమించారు. కాగా, చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్, ఎస్ఐ కిరణ్ రెడ్డి పరిస్థితిని సమీక్షించారు.

గాజుల నందన్ కుటుంబానికి ప్రశంసా పత్రం

గాజుల నందన్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న జీవన్‌దాన్ సంస్థ, యశోద హాస్పిటల్స్ ప్రతినిధులు

శంకరపట్నం, మార్చి 24: కేశవపట్నం గ్రామానికి చెందిన గాజుల శ్రీనివాస్-రమాదేవి దంపతుల కుమారుడు నందన్ ఇటీవల డెంగీ బారిన పడి మృత్యుఒడిలోకి చేరుకోగా, తల్లిదండ్రులు ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న జీవన్ దాన్ సంస్థకు అవయవదానం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం ప్రభుత్వం తరపున జీవన్ దాన్ సంస్థ పీఆర్‌వో మహిపాల్, సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ అవయవాల మార్పిడి విభాగం కో ఆర్డినేటర్ ప్రశాంత్ గ్రామంలోని అయ్యప్ప కాలనీకి వచ్చారు. నందన్ తల్లిదండ్రులతో పాటు సోదరి నయనను ప్రశంసిస్తూ ధ్రువీకరణ పత్రం అందజేసి, శాలువాలతో సత్కరించారు.

రేవంత్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కలెక్టరేట్, మార్చి 24: అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ ఇచ్చిన హామీలు అమలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల వెంకటరెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని మంకమ్మతోటలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకేసారి రూ.2లక్షల రైతు రుణమాఫీ, ఏటా ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, కౌలు రైతులకు రైతుభరోసా పథకాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రమాదవశాత్తు పలువురు రైతులు మరణించినా, వారికి బీమా వర్తింపజేయకపోవడం శోచనీయమన్నారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రఘునాయకుల రాంరెడ్డి, బావండ్లపల్లి మల్లయ్య, ముఖ్యనాయకులు రాంనర్సయ్య, పైడాకుల వెంకటేశ్వర్లు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్స్ వద్ద చోరీలు: ముగ్గురి అరెస్ట్

తిమ్మాపూర్, మార్చి 24: ఫంక్షన్ హాల్స్ వద్ద చోరీలకు పాల్పడుతున్న దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపారు. కరీంనగర్ ఖాన్‌పురాకు చెందిన మహ్మద్ రహీం బొమ్మకల్ ఫ్లైఓవర్ దగ్గరలోని అమ్మనిష్ సెంటర్‌లో జిమ్ ట్రైనర్‌గా పనిచేయగా, ఆ సెంటర్‌కు ఈత నేర్చుకోవడానికి వెళ్లిన 12 సంవత్సరాల బాలుడితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సులువుగా సంపాదించాలని ఉద్దేశంతో ఫంక్షన్ హాల్స్‌లో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఫంక్షన్స్ జరిగే ఫంక్షన్ హాల్స్ సమాచారాన్ని రహీం తన స్నేహితుడైన ఆటో డ్రైవర్ మైసన్ బిన్ హది ద్వారా తెలుసుకొని, బాలుడిని తన బైక్‌పై వెంట తీసుకువెళ్లేవాడు. హాల్స్ ముందు రహీం బైక్‌పై బయటే ఉండగా, బాలుడు ఫంక్షన్ హాల్స్ లోపలికి వెళ్లి, అజాగ్రత్తగా పెట్టిన వారి హ్యాండ్ బ్యాగ్స్ నుంచి బంగారు ఆభరణాలు దోచుకుని బయటకు వచ్చేవాడు. రహీంతో కలిసి బైక్‌పై పారిపోయేవారు. అలా కరీంనగర్, బొమ్మకల్, అలుగునూర్, హుజూరాబాద్‌లోని పలు ఫంక్షన్స్ హాల్స్‌లో దొంగతనాలకు పాల్పడి బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, డబ్బులు చోరీ చేశారు. అలా చోరీ చేసిన బంగారు ఆభరణాల్లో కొన్నింటిని అమ్మడానికి శనివారం వరంగల్‌కు బాలుడితో కలిసి మైసన్ బిన్ హాది బైక్‌పై వెళ్తుండగా.. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు సిబ్బందితో కలిసి వారిని పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు గ్రాముల బంగారు ఉంగరాలు, రెండు సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకొని నిందితులు ఇద్దరినీ జైలుకు పంపారు. ఆ తర్వాత ముఖ్య నేరస్తుడైన మహ్మద్ రహీంను పట్టుకోవడానికి సీపీ అభిషేక్ మొహంతి టాస్క్‌ఫోర్స్ సీఐ రవీందర్, ఎస్సీఐ సృజన్ రెడ్డి, కొత్తపెల్లి ఎస్ఐ సాంబమూర్తి, ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మహ్మద్ రహీం దొంగిలించిన సొత్తుతో పారిపోదామని కరీంనగర్ బస్టాండ్‌కు వస్తుండగా, జిల్లా పరిషత్ ఆఫీస్ ఎదుట పోలీసులు పట్టుకొని అతడి నుంచి 150 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీన పరుచుకొని రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు, కొత్తపెల్లి ఎస్ఐ సాంబమూర్తిని, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు కానిస్టేబుల్ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని సీపీ అభినందించారు.

నగరంలో తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు

ఎల్ఎండీలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- మానేరు డ్యాంలో నీటి నిల్వ పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నది
- మహిళలు మళ్లీ బిందెలు పట్టుకొని రోడ్లపైకి వచ్చే పరిస్థితి తేవద్దు
- ప్రభుత్వానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచన
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి ఎల్ఎండీలో నీటి నిల్వల పరిశీలన

కార్పొరేషన్, మార్చి 24: వేసవి కాలంలో నగరంలో ఎక్కడా కూడా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తాగునీటి సరఫరా చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం లోయర్ మానేరు డ్యాంలో నీటి నిల్వలను మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానకొండూర్‌తో పాటు నగరం చుట్టు పక్కల గ్రామాలకు తాగునీరు అందించే మానేరు డ్యాంలో నీటి నిల్వలు పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ కూడా మార్చిలో నీటి నిల్వలు ఇంతలా పడిపోవడం చూడలేదన్నారు. ప్రస్తుతం ఎల్ఎండీలో 5.3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎల్ఎండీ ద్వారా తాగునీటి అవసరాలు తీర్చిన తర్వాతే దిగువకు సాగునీరు అందించాలని జీవో ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మిషన్ భగీరథ కోసం ఎల్ఎండీలో 13 టీఎంసీలు, మధ్యమానేరులో 6.5 టీఎంసీల నిల్వలు తగ్గకుండా చూశామని తెలిపారు. తాము తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చామని, తర్వాత పంటలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో మధ్య మానేరు, ఎల్ఎండీ నీటితో నిండుకుండల్లా ఉండేవని గుర్తు చేశారు. నగరంలో ప్రతి రోజూ మంచినీటి సరఫరా చేయడంతోపాటు 24 గంటల పాటు నిరంతరం సరఫరా కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో మండుటెండల్లో కూడా చెరువులు మత్తడి దుంకాయని చెప్పారు. నేడు ఎల్ఎండీలో నీటి నిల్వలు పడిపోవడంతో నగరంలోని బోరింగ్‌లు కూడా పని చేయడం లేదన్నారు. ఇప్పటికే నగరంలో నీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని, ఎల్ఎండీలో నీటి నిల్వ పడిపోవడం వల్ల బూస్టర్ పంపుల ద్వారా నీటిని అందించడం సాధ్యపడడం లేదని తెలిపారు. మహిళలు మళ్లీ బిందెలు పట్టుకొని రోడ్లపైకి వచ్చే పరిస్థితి తేవద్దని ప్రభుత్వానికి సూచించారు. జిల్లాకు చెందిన మంత్రులు, సీఎం వెంటనే స్పందించి ఎల్ఎండీ నుంచి దిగువకు నీటి విడుదలను నిలుపుదల చేయించాలన్నారు. డ్యాంలో ప్రస్తుతం ఉన్న ఐదు టీఎంసీలకు మరో రెండు టీఎంసీలను మధ్యమానేరు నుంచి విడుదల చేస్తే కరీంనగర్‌లో ప్రజలకు రోజూ గంటపాటు తాగునీరు సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ మల్లేశ్

కమాన్‌చౌరస్తా, మార్చి 24 : శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో వివిధ విభాగాలు విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్ సంకశాల సూచించారు. ఆదివారం శాతవాహన విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏడు రోజుల రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి కోర్సులు రీసెర్చ్ స్కాలర్లకు పరిశోధనలో చాలా ఉపయోగపడుతాయన్నారు. వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆచార్య చన్న బసవయ్య మాట్లాడుతూ, సమాజంలోని సమస్యలకు పరిశోధనల ద్వారా పరిష్కారాలు చూపే గొప్ప బాధ్యత ప్రతి రీసెర్చర్‌పై ఉందన్నారు. దాన్ని ఎంతో నైపుణ్యంతో నిర్వర్తించేందుకు ఇలాంటి కోర్సులు వారికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ, ఇలాంటి కోర్సు నిర్వహించడానికి తనను ప్రోత్సహించిన శాతవాహన అధికారులు, ఈ కోర్సులో చేరి విజయవంతం చేసిన రీసెర్చ్ స్కాలర్స్ అందరినీ అభినందించారు. కార్యక్రమంలో కోర్సు కో డైరెక్టర్ డాక్టర్ ఈ మనోహర్, బిజినెస్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎం మనోజ్ కుమార్, కృష్ణ కుమార్, డాక్టర్ కే తిరుపతి, అజీజ్, విజయ్, సావిత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రేరణ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

హుజూరాబాద్ టౌన్, మార్చి 24: తెలంగాణ కామర్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రేరణ పోటీల్లో హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. రంగోలి పోటీల్లో పాల్గొని తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జాస్తి రవికుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ ఇందిరాదేవి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు వాణిజ్య శాస్త్ర విభాగం ఇన్‌చార్జి లక్ష్మీనరసింహమూర్తి, వాణిజ్యశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, ఐకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పీ దినకర్, అధ్యాపకులు అభినందించారు.

ఆర్యవైశ్య సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న పట్టణ ఆర్యవైశ్య, యువజన సంఘాల పాలకవర్గ సభ్యులు

హుజూరాబాద్ టౌన్, మార్చి 24: పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. హుజూరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సుద్దాల హరిశంకర్, ప్రధాన కార్యదర్శిగా నూక శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడిగా కొడితే నాగరాజు, కార్యవర్గ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు చందా రాజు, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ నూతన పాలకవర్గాలను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు సతీశ్ చింతకింది, శ్రీనివాస్, పున్నంచందర్, చక్రధర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు

కలెక్టరేట్, మార్చి 24 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు విడుదల చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల షెడ్యూల్ విడుదల కాగా, ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ శాఖలు, వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న అధికారుల నుంచి మొదలు కింది స్థాయి సిబ్బంది కూడా సెలవులు వినియోగించుకోవడాన్ని నిషేధిస్తున్నట్లు పేర్కొన్నది. ఎన్నికలకు సంబంధించి ఎప్పటికప్పుడు వచ్చే ఉత్తర్వులు, అత్యవసర మెయిల్స్, ఇతర సమాచారం జిల్లా ఎన్నికల యంత్రాంగానికి అందించేందుకు వీలుగా సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వహించాలని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందిని ఆదేశించింది.

వైభవంగా చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

తిమ్మాపూర్ రూరల్, మార్చి 24 : మొగిలిపాలెంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి అధ్యయన బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. దాతలు అన్నదానం చేశారు. శకటోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

రంగుల పండుగ హోలీ వచ్చేసింది. సప్తవర్ణాలతో వసంతమాడేందుకు ఊరూవాడా సిద్ధమైంది. స్నేహభావంతో ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ మనుషులంతా సమానమని చాటి చెప్పే కలర్‌ఫుల్ వేడుక కోసం పేదా గొప్ప, చిన్నాపెద్దా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నది. నేటి ఉదయం నుంచి రెండ్రోజులపాటు రంగుల ప్రపంచంలో తేలిపోనున్నది.

– కమాన్‌చౌరస్తా, మార్చి 24

భగత్ నగర్‌లో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో కామదహన వేడుకలను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్ రావు

రంగేలి

- నేడు హోలీ
- వసంతంలో తొలి పండుగ
- రెండ్రోజులపాటు వేడుకలు
- సహజ రంగులే మేలు
- రసాయనాలతో హాని

ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకొనే పండుగ హోలీ. వసంత రుతువులో వచ్చే తొలి వేడుక ఇది. వసంతగమనాన్నీ, కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ పాల్గుణ పౌర్ణమి రోజు జరుపుకొనే ఈ పర్వదినాన్ని వసంతోత్సవం అనీ, పాల్గుణోత్సవం అని కూడా అంటారు. ఈ పండుగ రోజు చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా రంగులు చల్లుకుంటారు. ఎంతో సంబురంగా జరుపుకొంటారు. ఎప్పట్లాగే ఈ సారి హోలీని ఘనంగా జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు.

కామదహనం..

హోలీ అనగానే గుర్తొచ్చేది కాముని పున్నం. ఊళ్లలో పిల్లలు పది రోజుల ముందు నుంచే ఇంటింటా తిరుగుతూ జాజిరి ఆటలు ఆడుతారు. సేకరించిన డబ్బులు పంచుకుని, ధాన్యంతో వంటలు చేసుకుంటారు. హోలీ ముందు రోజు రాత్రి పది గంటల నుంచి కామదహనం నిర్వహిస్తారు. ఇన్ని రోజులు ఆడిన కోలలను అందులో వేస్తారు. శరీరంలోని చీడ, పీడలు వదిలి అందరికీ సర్వ సుఖాలు కలగాలని ఆశిస్తూ ఇంట్లోని పాత చెక్క వస్తువులు, కలపను చొరస్తాలు, ప్రధాన ప్రాంతాల్లో చేర్చి దహనం చేస్తారు. మిగిలిన బూడిదను దిష్టి తగలకుండా బొట్టు పెట్టుకుంటారు. శారీరక, మానసిక ప్రశాంతత చేకూరాలని వేడుకుంటారు.

సహజ రంగులే మేలు..

ప్రాచీనకాలంలో రంగుల కోసం మోదుగ పూలు వాడేవారు. ఇవి చర్మానికి ఎంతో శోభ తెచ్చేవి. మోదుగపూలను ఎండబెట్టి దాని నుంచి రంగులు తయారు చేయవచ్చు. ఇది ఆరోగ్యానికి దోహదకారి మాత్రమే గాక, ఈ కాలంలో వచ్చే రోగాలకు దివ్యమైన ఔషధంలా పని చేస్తుంది. ఇంకా హెన్నా(మైదాకు పొడి), పసుపు, కుంకుమ, చందనం, టమాట గింజలతో తయారైన పొడిని నీళ్లలో కలిపి చల్లుకునే వారు. ఇలాంటి రంగులు పూసుకోవడం ద్వారా సంతోషం, ఆనందం కలుగుతాయి. అలాగాక రసాయనాలు కలిపిన రంగులు పూసుకోవడం వల్ల లేనిపోని చర్మరోగాలు అంటుకుంటాయి. కానీ, ఇప్పుడు ఎక్కడ చూసినా రసాయనిక రంగులే కనిపిస్తున్నాయి. వీటితో లేని పోని ఆరోగ్య సమస్యలు వస్తాయి. అందుకే స్వచ్ఛమైన కుంకుమ, బుకా గుల్లాలు వంటి రంగులతో పండుగ జరుపుకొంటే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

వైభవంగా గాయత్రీ మహాయజ్ఞం

కరీంనగర్ రూరల్, మార్చి 24: తీగలగుట్టపల్లిలోని మహాయోగిని మణికేశ్వరి మాత ఓంకార ఆశ్రమంలో ఆదివారం గాయత్రీ మహాయజ్ఞం అత్యంత వైభవంగా జరిగింది. మహాయజ్ఞం అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. అమ్మవారికి పాద పూజ చేశారు. తర్వాత అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శంకర్‌స్వామి, కమిటీ సభ్యులు మడూరి ప్రసాద్, నగునూరి ప్రసాద్, అశోక్, అకేనపల్లి నాగరాజు, నగునూరి మహేశ్, సతీశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో మంకమ్మతోట ధన్గర్‌వాడీ పాఠశాల, శంకరపట్నం మండలం తాడికల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

కమాన్‌చౌరస్తా/ శంకరపట్నం, మార్చి 24: జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట ధన్గర్‌వాడీ హైస్కూల్ పూర్వవిద్యార్థుల (2001 బ్యాచ్ పదో తరగతి) ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం గోదాంగడ్డలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. అలాగే శంకరపట్నం మండలం తాడికల్ హైస్కూల్‌లో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆటపాటలతో సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, మార్చి 24: హోలీ సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో ఈ నెల 31వరకు ఖాదీ వస్త్రాలు 40శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ వీ భిక్షపతి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

జర్నలిస్ట్ బుర్ర ఆంజనేయులును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మేయర్ సునీల్ రావు

కార్పొరేషన్, మార్చి 24: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘం జనహక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ కమ్యూనిస్టు నేత బుర్ర కొండయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం ఆయన కుటుంబ సభ్యుడు సీనియర్ జర్నలిస్ట్ బుర్ర ఆంజనేయులు గౌడ్ తదితరులను ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గీత కార్మికుల సంక్షేమానికి బుర్ర కొండయ్య గౌడ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అనేక భూపోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు.

మాజీ ఎమ్మెల్యే సుంకె పరామర్శ

నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

సిరిసిల్ల రూరల్, మార్చి 24: నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావును చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ప్రకాశ్‌రావు తల్లి సావిత్రీబాయి(90) ఆదివారం మృతి చెందింది. స్వగ్రామమైన తంగళ్లపల్లి మండలం చీర్లవంచ పరిధిలోని నాయినోరిపల్లెలో ఆమె తుదిశ్వాస విడువగా, ఈ విషయం తెలుసుకున్న సుంకె రవిశంకర్ వెంటనే గ్రామానికి వెళ్లారు. సావిత్రీబాయి భౌతికకాయానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రకాశ్‌రావును పరామర్శించారు. సుంకెతోపాటు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, లయన్స్ క్లబ్ సభ్యులు, పలువురు ప్రముఖులు పరామర్శించారు.

ముంజంపల్లిలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

మానకొండూర్ రూరల్, మార్చి 24: ముంజంపల్లిలో ఆదివారం బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు నందగిరి మల్లయ్యాచారి పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకుడు కాసం బ్రహ్మ రెడ్డి, మాజీ వార్డు సభ్యురాలు బత్తిని రమ, మహిళా గ్రామాధ్యక్షురాలు కైరి రజిత, రెడ్డి సంఘం అధ్యక్షుడు బండ విజేందర్ రెడ్డి, నాయకులు రాజగోపాల్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, వెంకట రెడ్డి, సాగర్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్, యాదవ్, సత్తయ్య, భూమేశ్, శ్రీనివాస్, లింగారెడ్డి, రత్నాకర్ రెడ్డి, రాజిరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీగా వినోద్ కుమార్‌ను గెలిపించుకుంటాం'

చిగురుమామిడి, మార్చి 24: కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య స్పష్టం చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాకే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని గ్రామగ్రామాన ప్రజల